నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ మైవిల్లాస్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీఎస్‌పుడ్స్ కాలనీ, కాకతీయ కాలనీ, ఓల్డ్ విలేజ్, యాదయ్యనగర్, జయశ్రీ కాలనీ, కమలనగర్, అరవింద ఎన్‌క్లేవ్, రామకృష్ణానగర్, అక్షయ ఎన్‌క్లేవ్, మైవిల్లాస్‌లలో కరెంట్ నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

11 కేవీ ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో..

చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయిరెసిడెన్సీ, వెంకటాద్రి నగర్, ఆదర్శనగర్, ఆర్టీసీకాలనీ, హేమగిరి కాలనీ, ప్రశాంత్, రంగరంగయ్య నగర్‌లలో కరెంటు సరఫరా నిలిపివేస్తామని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

చర్చి కాలనీ ఫీడర్ పరిధిలో..

రామంతాపూర్: విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చర్చి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు నెహ్రూనగర్ పోచమ్మ దేవాలయం, ఐశ్వర్య అపార్టుమెంట్స్, సుప్రజ అపార్టుమెంట్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ లావణ్య కోరారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



వసంతపురి కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

గౌతంనగర్: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వసంతపురి కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముత్తు శ్రీనివాసన్, వెంకటేష్, సంతోష్, కిషోర్, శోభారాణి, యాదమ్మ, సోమయ్య, రాము, శిరీష, యాదగిరి, శకుంతల, రోస్ మేరీ, రెడ్డి, భాగ్యమ్మ, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ఏపీలోని టీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



మల్లాపూర్: తెలంగాణలోని చాలామంది ఉపాధ్యాయులు రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండిపోయారని, తెలంగాణ ప్రభుత్వంలో బదిలీల విషయంలో న్యాయం జరగలేదని కోరతూ ఉపాధ్యాయులు మంగళవారం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బొంగోని ఉమేష్‌గౌడ్, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, జోష్ విక్టరీ తదితరులున్నారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

ఉప్పల్: అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చకాచకా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ వేగవంతం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరణ వరకే ఆదేశాలు ఉన్నాయని, కార్డుల జారీకి ఇంకా విధివిధానాలు, మార్గదర్శకాలను ప్రభుత్వం ఖరారు చేయలేదని వారు అంటున్నారు. ఇప్పటికే మీ–సేవ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ దాదాపు 200కు పైగా దరఖాస్తులు అందుతున్నాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు దాదాపు 43 వేల వరకు ఉన్నాయని, డీఎస్‌వో పరిశీలనకు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ఉప్పల్ సర్కిల్ సివిల్ సప్‌లై కార్యాలయంలో ఇప్పటికే మూడు కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ మరింత వేగవంతం చేసినట్లు ఏఎస్‌వో బాలారాజు తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.



అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల కోసం వేచిచూస్తున్నాం. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వేగవంతం అయ్యింది. కార్యాలయంలో కౌంటర్ల సంఖ్య పెంచాం. అవసరమైతే మరిన్ని కౌంటర్లను ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తాం.

– బాలరాజు, ఉప్పల్ సివిల్ సప్లై అధికారి బాలరాజు

మిద్దెతోట.. ఆరోగ్యబాట

తాజా పండ్లు, కూరగాయలతో ఎంతో ఆరోగ్యం	పెరట్లు, ఆవరణాలు, బాల్కనీల్లో పంటల సాగు	బోడుప్పల్‌లో టెర్రస్ గార్డెన్‌పై పెరుగుతున్న ఆసక్తి

పట్టణవాసులు మిద్దెతోటలపై ఆసక్తి చూపుతున్నారు. పల్లెల్లో పుట్టి పెరిగి మట్టివాసనలు చూసినవారు ఉద్యోగ రీత్యా మహానగరంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. పొల్యూషన్, హానికరమైన రసాయనాల నుంచి విముక్తి కోసం ఇంట్లో కూరగాయలు, పండ్లు సాగు చేసుకుంటున్నారు. తాజాగా వాటిని తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పచ్చదనం ఉండటంతో సాయంత్రం పూట గార్డెన్‌లో సేదతీరుతున్నారు.

– బోడుప్పల్



రమణారెడ్డి మిద్దెపై పెంచుతున్న పంట మొక్కలు

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో పెద్దసంఖ్యలో కుటుంబాలు ఇంటి పంటలు, మిద్దె తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పెరట్లు, బాల్కనీలు, మిద్దెలపై సేంద్రీయ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండిస్తున్నారు. వాటితో పాటు ఔషధ మొక్కలను పెంచుతున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు పండించడంలో పురుగు మందులు వాడుతుండటంతో అనారోగ్యానికి గురవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బోడుప్పల్ ఆంజనేయనగర్ కాలనీలో నివాసం ఉండే గాదె రమణారెడ్డి, శ్రీలత దంపతులు, లతా రమణా సహజ వ్యవసాయ క్షేత్రం(మిద్దె తోట గార్డెన్) పేరుతో వివిధ రకాల పంటలను పండిస్తున్నారు.

మిద్దెతోటపై సాగు చేస్తున్న విధానం

మిద్దెపై కుండీలు, బకెట్లు, డ్రమ్స్‌లో ఎర్రమట్టి పోసి మొక్కలు పెంచుతున్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు పెడతారు. ఎలాంటి క్రిమిసంహార మందులు వాడకుండా సహజ ఎరువులు వాడుతున్నారు. ప్రతిరోజూ రమణారెడ్డి, శ్రీలత దంపతులు వాటి ఆలనా పాలనా చూస్తున్నారు. వారి మిద్దెపై పండే ఆకు కూరలు, కాయగూరలు వారి కుటుంబానికి సరిపోగా మిగిలిన వాటిని ఇరుగు పొరుగు వారికి ఉచితంగా ఇస్తున్నారు.

ప్రకృతి విధానంలో ఆరు రకాల పంటలు

ప్రకృతి విధానంలో ఆరు రకాల పంటల పేరుతో మిద్దెతోట సాగు నిర్వహిస్తున్నారు. 1.కూరగాయలు, 2.పండ్లు, 3.పూలు, 4.సుగంధ ద్రవ్యాలు, 5.ఔషధ మొక్కలు, 6.అలంకరణ, ఆక్సిజన్‌ను ఇచ్చే మొక్కలు

కూరగాయలు: ఆకు కూరలు, పప్పు ధాన్యాలు, టమాటా, వంకాయ, మిర్చి, సొరకాయ, బీరకాయ, పొట్లకాయ, క్యారెట్, దోస, క్యాబేజీ, పాలకూర, చుక్కకూర, మెంతికూర, పుదీన, కరవేపాకు, తోటకూర, గంగవాయిల్ కూర, శనగలు, చిక్కులు, కాకరకాయ, మొక్కజొన్న పండిస్తున్నారు.

పండ్లు: వాటర్ ఆపిల్, జామ, మామిడి, తెల్ల నేరేడు, రేగు, అవకాడో, అంజీర, బత్తాయి, బొప్పాయి, సపోట,

పూలు: గులాబీ, గుడ్డిగులాబీలు, మందార, బంతి, గన్నేరు, చామంతి, నందవర్ధనం, జాజి, మల్లెలు వంటి 20 రకాల పూల మొక్కలు పెంచుతున్నారు.

సుగంధ ద్రవ్యాలు: అల్లం, వెల్లుల్లి, ఉల్లి, యాలకులు, ధనియాలు

ఔషధ మొక్కలు: మునగ, పసుపు, తులసి, శంఖు పూలు, నిమ్మ చెట్లు, తిప్పతీగ

- అలంకరణ, ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు: మనీ ప్లాంట్, క్రోటాన్స్, అత్తిపత్తి, స్పైడర్ ప్లాంట్, స్నేక్ ప్లాంట్, రబ్బర్ ప్లాంట్, పీస్ లిల్లీ తదితర మొక్కలు.

ఆరోగ్యంగా ఉన్నాం..

పది సంవత్సరాలుగా ప్రకృతి విధానంతో మిద్దెతోట సాగు పంటలు పండిస్తున్నాం. మా మిద్దెపై పండే ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తినడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉన్నాం. ప్రతిరోజూ ఈ పనులు చేయడం వల్ల ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు ఆనందంగా ఉన్నాం. సహజ ఆహారం, ప్రకృతి జీవన విధానంతో అన్ని సమస్యలు, జబ్బులకు పరిష్కారం దొరుకుతుంది.

– గాదె శ్రీలత రమణారెడ్డి



వాటర్ ఆపిల్ మొక్కను చూపుతున్న రమణారెడ్డి దంపతులు



బీరకాయలు



టమాటా మొక్కలు

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

కుషాయిగూడ: చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న కుషాయిగూడ వేంకటేశ్వర స్వామి ఆలయ పక్క వీధిలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం ఆమె యూజీడీ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేశారన్నారు. చాలా రోజుల క్రితం వేసిన డ్రైనేజీ కావడంతో సామర్థ్యం తగ్గి తరచూ వీధుల్లో మురుగు పొరుతూ సమస్య తలెత్తడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు యూజీడీ పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ సందీప్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా యూజీడీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కుషాయిగూడలో యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

పూర్తిస్థాయి సర్వే నిర్వహించాలి

రాష్ట్ర బీసీ కమిషనర్ సభ్యురాలు బాలలక్ష్మి



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషనర్ సభ్యురాలు బాలలక్ష్మి

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే పూర్తిస్థాయిలో నిర్వహించి క్షేత్రస్థాయిలో వివరాలను పొందు పర్చాలని రాష్ట్ర బీసీ కమిషనర్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో కులగణనపై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు, వార్డు అధికారులకు సర్వేకు సంబంధించిన దిశానిర్దేశం చేయాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావుకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేయాలని వినతి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లోని రోడ్ నంబర్–09, 10లో సీసీ రోడ్డు పనులను చేపడుతామని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. రోడ్లు వేయాలని కోరుతూ ఇందిరానగర్ కాలనీవాసులు కార్పొరేటర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఫారుక్, ఫాహిమ్, అబ్దుల్, స్టీఫిన్, జయరాజ్, అన్వర్ పాషా, జుబేదా బేగం, సయ్యద్ ముషారఫ్, యాసిన్, ప్రభాకర్, వసీమ్, హైదర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.



కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఇందిరానగర్ కాలనీ వాసులు

రంజాన్ మాసంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల కుటుంబాలు ఉపవాస దీక్షలు చేసే సమయంలో తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అధికారుల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మసీదుల సదర్లతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. శానిటేషన్ సిబ్బంది ప్రణాళికబద్దంగా పనిచేసేలా చూడాలని కోరారు. పాతబస్తీలో ఏర్పాటు చేసిన విధంగా రాత్రి సమయాల్లో షాపింగ్‌కు మల్కాజిగిరిలో కూడా సముదాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గ ముస్లిం పెద్దలు, మసీదుల సదర్లు ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

బైక్ చోరీ చేసిన నిందితుడికి రిమాండ్

ఘట్‌కేసర్: బైక్ చోరీ నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ పట్టణం మేడపాటినగర్‌కు చెందిన సప్పిడి యశ్వంత్‌రెడ్డి బైక్ చోరీ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన ఘట్‌కేసర్ పోలీసులు నిందితుడు మహబూబ్‌నగర్ పాతపాలెంకు చెందిన వడ్డె రాజు(33)ను అరెస్ట్ చేశారు. అతడి దగ్గరి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణ ముఖ్యమే..

ఉప్పల్: విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా విద్యార్థులకు ముఖ్యమేనని అంకుర ఆస్పత్రి వైద్య నిపుణులు డా.సుధారాణి అన్నారు. ఉప్పల్ బబుల్జ్ ప్రైమరి స్కూల్‌లో యాజమాన్యంతో కలిసి నిర్వహించిన వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వైద్య శిబిరాలు ఆరోగ్య అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన పెంచుతాయన్నారు. కార్యక్రమంలో డాకర్లు చందన, మృదుల, హర్షిత, పాఠశాల ప్రిన్సిపల్ చందన శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో అంకుర ఆస్పత్రి సిబ్బంది తదితరులు

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ముగిశాయి. సేవాకాలం, ద్వారతోరణ పూజ, సంతాన ఇష్టి, 108 కలశాలతో అభిషేకం, చక్రస్నానం, వసంతోత్సవం, పుష్ప యాగం, రుత్విక్ సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పన్నాల కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ అంజి పటేల్, భక్తులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రిలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

గౌతంనగర్: ఆశా వర్కర్ల సమస్యలపై వివరించేందుకు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ మంగళవారం మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆఫీస్‌కు వచ్చారు. వారు అందుబాటులో లేకపోవడంతో ఆర్ఎంవో శివకిరణ్, డాక్టర్ సంగీతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా వర్కర్లను జిల్లా ఆస్పత్రికి రావొద్దంటూ, డెలీవరీ కోసం కానీ, వ్యాక్సిన్ కోసం కానీ తీసుకువచ్చిన పేషంట్లను చూడట్లేదని తనకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ జిల్లా ఆస్పత్రి వాస్తవానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానిదేనని, నేరేడ్‌మెట్‌లోని ఆరోగ్య కేంద్రాన్ని మల్కాజిగిరి ప్రజల కోసం ఇక్కడికి మార్చాలని కోరారు. ఆశా వర్కర్లకు రోగం వస్తే తగిన ప్రాధాన్యతతో వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు హేమలత, వసంత, శిరీష, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ టాక్స్ చెల్లించని మార్బుల్ షాప్ సీజ్



మార్బల్ షాపును సీజ్ చేస్తున్న అధికారులు

ఉప్పల్: ప్రాపర్టీ టాక్స్ చెల్లించకపోవడంతో మంగళవారం ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు మార్బల్ షాప్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ హైదరాబాద్ మార్బల్ షాపునకు సంబంధించి రూ.38 లక్షలు ప్రాపర్టీ టాక్స్ చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని నోటీసులు ఇచ్చామని, అయినా స్పందించకపోవడంతో షాప్‌ను సీజ్ చేశామని తెలిపారు.

అగ్నిప్రమాదంలో రెండు బస్సులు దగ్ధం



కాప్రా: ఆర్టీసీ కుషాయిగూడ డిపోలో రెండు సిటీ బస్సులు మంగళవారం రాత్రి దగ్ధమయ్యాయి. ఒకటి పూర్తిగా, మరొకటి పాక్షికంగా కాలిపోయాయి. డిపో మేనేజర్ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం డిపోలోని పార్కింగ్ స్థలంలో రెండు బస్సులను వేర్వేరు చోట నిలిపారు. రాత్రిపూట అకస్మాత్తుగా బస్సుల్లోంచి మంటలు వ్యాపించినట్లు సిబ్బంది గుర్తించారు. దాంతో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది కొందరు భయంతో పరుగులు తీశారు. ఈ క్రమంలోనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేసినప్పటికీ ఫైర్ ఇంజన్ డిపోకు చేరుకొనే సమయానికే ఒక బస్సు పూర్తిగా, మరొకటి పాక్షికంగా దగ్ధమయ్యాయని డీఎం చెప్పారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియడం లేదని చెప్పారు. పార్కింగ్‌లో నిలిపిన బస్సులు కావడం వల్ల షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేదని పేర్కొన్నారు. ప్రమాదఘటనపై తమ సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించిన తరువాత పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

మహిళ అదృశ్యం



మాధవి(ఫైల్)

అల్వాల్: ఫోన్ ఎక్కువగా మాట్లాడుతోందని భర్త మందలించడంతో భార్య అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ ఆదర్శనగర్ కాలనీలో గోరంట్ల రవి, భార్య మాధవి నివాసం ఉంటున్నారు. మాధవి తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో భర్త రవి మందలించాడు. దీంతో వారిద్దరికి గొడవ జరిగింది. ఈ నెల 17వ తేదీన సాయంత్రం రవి ఇంటికి వచ్చి చూసేసరికి మాధవి కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.